క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో నేడు (బుధవారం)విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబ రెడ్డి తెలిపారు. ప్రశాంత్‌నగర్, రిజిస్ట్రేషన్ కార్యాలయం రోడ్, తారా బార్ ఏరియాలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు సిద్ధార్థనగర్, ఫాతిమా జంక్షన్, బాబు క్యాంపు కార్యాలయం ప్రాంతంలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, న్యూశాయంపేటలోని మోక్షా విల్లాస్ రోడ్, శ్రీరాం హిల్స్ ఏరియాలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

శ్రీధర్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ భౌతిక శాస్త్రం విభాగ పరిశోధకుడు చింతల శ్రీధర్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. స్టడీస్ ఇన్ ఫొటోకెటలిటిక్ యాక్టివిటీ ఇన్ సమ్ రెడ్యూస్డ్ గ్రఫీన్ ఆక్సైడ్ ట్రాన్సిషన్ మెటల్ ఆక్సైడ్ కాంపోజిట్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి శ్రీధర్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పద్మజ పర్యవేక్షణలో శ్రీధర్ తన పీహెచ్‌డీ పూర్తి చేశారు.

ఎన్నిక



సాంబమూర్తి

కాజీపేట : ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం(జీటీఏ) వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కాజీపేటకు చెందిన ఉపాధ్యాయుడు పెరుమాండ్ల సాంబమూర్తి మంగళవారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన నియమాకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు కాసం ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి ప్రకాష్ గౌడ్‌తో పాటు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

చేనేతకు తీరని అన్యాయం

వరంగల్ : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చేనేత రంగానికి తీరని అన్యాయం జరిగిందని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో అన్నారు. రూ.47.65 లక్షల కోట్ల బడ్జెట్‌లో ముష్టి వేసినట్టుగా చేనేతకు కేవలం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించడం సరికాదన్నారు. దేశవ్యాప్తంగా కోటి మందికి పైగా చేనేత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న ఈ రంగానికి కనీసం రూ.5,000 కోట్లు కేటాయించి చేనేతల అభివృద్ధికి, సంక్షేమానికి చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. చేనేత రంగంపై జీఎస్టీపేరుతో వేలాది కోట్ల రూపాయలు రాబట్టుకుంటున్న కేంద్ర ప్రభుత్వం చేనేత రంగాన్ని కావాలని విస్మరించిందన్నారు. చేనేత రంగాన్ని కాపాడేందుకు నేతన్నలను ఆదుకునేందుకు బడ్జెట్‌లో సవరణలు చేసి నిధులు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎంపీకి ఆహ్వానం

కరీమాబాద్ : వరంగల్ రంగశాయిపేటలో ఈ నెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న భూలక్ష్మి, శ్రీలక్ష్మి సహిత బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవానికి రావల్సిందిగా కోరుతూ కమిటీ సభ్యులు మంగళవారం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



ఖిలా వరంగల్ : వరంగల్ శంభునిపేట విశ్వనాథ కాలనీలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో దర్శన్ కంటి ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ బచ్చు సింధు ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ కర్నె రవీందర్ సహకారంతో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. నేత్ర పరీక్షలు చేసి చూపు మందగించిన వారికి ఉచితంగా మందులు, కంటి అద్దాలు అందజేశారు. ఎలుగు రవీందర్, దేవేందర్, సంజీవ్, సతీష్, సుధాకర్, సదానందం, సంపత్ పాల్గొన్నారు.

రేపు ఉచిత ఫైబ్రోస్కాన్ వైద్యశిబిరం

కాజీపేట : కాజీపేట పట్టణంలోని లతా వెంకట్ ఆర్థో, జనరల్ కేర్ ఆస్పత్రిలో రేపు గురువారం ఫైబ్రోస్కాన్ ఉచిత స్క్రీనింగ్ పరీక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు డా.మాధవరం శ్రీలత ప్రకటనలో తెలిపారు. బీపీ, షుగర్, అధిక బరువు, అధిక కొవ్వు, అధిక మద్యపానం అలవాటు, మెనోపాజ్ తదితర సమస్యలతో బాధపడుతున్న ప్రజలు వైద్య శిబిరంలో అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

ఇద్దరికి కుక్కకాటు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లోని రైల్వే దేవాలయ సముదాయంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఆలయానికి దైవ దర్శనం, పూజ కోసం వచ్చిన వారు వాటిని చూసి భయాందోళనకు గురవుతున్నారు. మంగళవారం ఆలయానికి పూజ కోసం వచ్చిన బీజేపీ మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం, బొడగుట్ట వాసి రాజుపై కుక్కలు దాడి చేసి కరిచి గాయపరిచాయి. అధికారులు స్పందించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బెటాలియన్ అభివృద్ధికి కృషి

- సృజనాత్మక విద్యను అందించాలి
- టీఎస్ఎస్పీ బెటాలియన్, పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే నాగరాజు



ఎమ్మెల్యే నాగరాజును సన్మానిస్తున్న కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి, కార్పొరేటర్ అనిత,రంజిత్

మామునూరు : స్పెషల్ పోలీసుల సంక్షేమంతో పాటు టీఎస్ఎస్పీ బెటాలియన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి మరింతగా కృషి చేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు అన్నారు. ఈమేరకు మంగళవారం ఖిలావరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ బెటాలియన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా నాలుగో బెటాలియన్ ప్రాంగణంలో కమాండెంట్ శివప్రసాద్, ఏసీ వేణుగోపాల్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే మొక్క నాటారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యేను టీఎస్ఎస్ రిటైర్డ్ అధికారుల సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి ఇనుగాల జోగిరెడ్డి, స్పెషల్ పోలీస్ అధికారులు, సిబ్బందితో పుష్పగుచ్చాలు, మెమోంటోలు అందజేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) వాసంతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. పుట్టిన గడ్డను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో సీపీ హోదాలో పదవీ విరమణ పొందిన తర్వాత ప్రజలకు ప్రత్యక్షంగా సేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఎమ్మెల్యేగా స్పెషల్ పోలీసుల అభ్యున్నతి, చదువుకున్న క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి, బెటాలియన్‌లోని అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు, మౌలిక సౌకర్యాల కల్పనకు మరింత చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. త్వరలోనే అదనపు తరగతి గదుల నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే నాగరాజు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ రాంబాబు, వేణుగోపాల్‌రెడ్డి, ఏసీపీ సతీష్‌బాబు, కార్పొరేటర్ జలగం అనిత, రంజిత్, ఇనుగాల జోగిరెడ్డి, రంగరాజు ప్రకాశ్, కత్తి సమ్మయ్య, గంట నరేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించొద్దు



ర్యాలీలో మాట్లాడుతున్న ఏసీపీ భోజరాజు

కాజీపేట /హన్మకొండ అర్బన్ : ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపే వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడానికి పోలీసు శాఖ సిద్ధంగా ఉందని ట్రాఫిక్ ఏసీపీ ఎం.భోజరాజు అన్నారు. కాజీపేట ప్రధాన రహదారిలోని ఫాతిమా నగర్ బస్‌స్టాప్ నుంచి మదర్‌థెరిసా విగ్రహం వరకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీని మంగళవారం ఏసీపీ ప్రారంభించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు పింగిళి మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, నెహ్రూ యువ కేంద్రం సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సీఐ కె.సుజాత, ఎస్సైలు మొగిళి, రామారావు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు రోలర్‌తో బైక్ సైలెన్సర్లు ధ్వంసం

వరంగల్ క్రైం : హనుమకొండ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అధిక శబ్దాలు చేసే సైలెన్సర్లను బైక్‌ల నుంచి వేరు చేసి వాటిని కేయూ క్రాస్ వద్ద ప్రజల సమక్షంలో రోడ్డు రోలర్‌తో మంగళవారం ధ్వంసం చేయించారు. ట్రాఫిక్ ఏసీపీ భోజరాజు, ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి, ఎస్సై మనోజ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. యువకులు రకరకాల సైలెన్సర్లను అమర్చి ప్రజలకు శబ్దాలతో ఇబ్బందులు కలిగిస్తున్నారని ఏసీపీ తెలిపారు. పదే పదే ఇలానే చేస్తే వారి వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

‘బెదిరింపులకు పాల్పడుతున్నారు’

కాశిబుగ్గ : సమస్యలు పరిష్కరించాలని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్తే జీడబ్ల్యూఎంసీ కమిషనర్, అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని చిన్నవడ్డేపల్లి చెరువు ఆక్రమణ ఏరియా పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు పెరుమాళ్ల లక్ష్మణ్ ఆరోపించారు. మంగళవారం కాశిబుగ్గలోని సొసైటీ కార్యాలయంలో ఆత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జీడబ్ల్యూఎంసీ గ్రీవెన్ సెల్‌లో చిన్నవడ్డేపల్లి చెరువు, మట్టెవాడ కోట చెరువు, ఉర్సు రంగసముద్రం చెరువు, భద్రకాళి చెరువు, కట్టమల్లన్న చెరువుల్లో గుర్రపు డెక్క పెరిగి చెరువులు మురికికూపాలుగా మారయన్నారు. చెరువులో నీరు కలుషితమై దుర్వాసనతో దుర్వాసన వస్తోందని ఫొటోలతో మూడు నెలల్లో ఎనిమిది సార్లు కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇలా నిర్లక్ష్యం చేస్తే ఎట్లా అని కమిషనర్‌ను సోమవారం జీడబ్ల్యూఎంసీ గ్రీవెన్ సెల్‌లో ప్రశ్నించగా కమిషనర్ రిజ్వాన్ బాషా, అసిస్టెంట్ కమిషనర్లు, ఇంజనీరింగ్ ఎస్ఈ తదితర అధికారులు కోపంతో మీరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదంటూ తీవ్ర పదజాలంతో పరిరక్షణ సొసైటీ సభ్యులను ఇంకోసారి గ్రీవెన్ సెల్‌కు రానియకండి, వీళ్లపై పోలీసులకు ఫిర్యాదు చేయండంటూ బెదిరించారని వారు ఆరోపించారు. నగరంలోని చెరువుల రక్షణకు పోరాటం చేస్తున్న తమ సొసైటీ సభ్యులను అవమానించి బెదిరింపులకు గురిచేసిన జీడబ్ల్యూఎంసీ అధికారులపై జిల్లా కలెక్టర్‌కు, సీడీఎంఏ, మున్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేయాలని సమావేశంలో తీర్మానించామని తెలిపారు. సమావేశంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి సిలువేరు నగేష్, ఉపాధ్యక్షుడు పోతన వెంకటేశ్వర్లు, కోశాధికారి మాడేటి అశోక్‌కుమార్, కార్యదర్శి గణిపాక క్రాంతికుమార్, సిలువేరు శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

కాశిబుగ్గ : కార్మికుల సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్తంగా ఈనెల 16వ తేదీన చేపట్టనున్న కార్మిక సమ్మెను విజయవంతం చేసేందుకు సహకారం అందించాలని ఏఐసీటీయూ ప్రధాన కార్యదర్శి సుంచు జగదీశ్ అన్నారు. ఈమేరకు మంగళవారం వరంగల్ మార్కెట్ కార్యదర్శి సంగయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ కార్మిక చట్టాలను అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నాయని అన్నారు. సమ్మెలో మార్కెట్ కార్మికులు అందరు పాల్గొనేందుకు 16వ తేదీన సెలవు ప్రకటించాలని కోరారు.

వరంగల్ : దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఈనెల 16వ తేదీన చేపట్టిన కార్మిక సమ్మె(గ్రామీణ భారత్ బంద్)ను విజయవంతం చేయాలని ఆల్ మిల్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఇనుముల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ సమీపంలోని వరంగల్ ప్రగతి ఇండస్ట్రియల్ ఏరియా గొర్రెకుంట క్లస్టర్‌లోని కార్మికులను కలిసి సమ్మె నోటీసులు, కరపత్రాలు అందజేశారు.

కనీస వేతనం చెల్లించాలి

వరంగల్ చౌరస్తా : ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఏఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీకేఎం ఆస్పత్రిలో సమ్మె వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. మంగళవారం వరంగల్‌లోని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) రైతు-వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్యవేదిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం దురుద్దేశంతో కార్మికులకు అన్యాయం చేస్తోందన్నారు. ఈ సమావేశంలో కార్మిక సంఘం నాయకులు అరెల్లి కృష్ణ, ఖాసీం పాల్గొన్నారు.

రిష్యంత్‌కు అభినందనలు



రిష్యంత్‌ను అభినందిస్తున్న ఉదయభానురావు

వరంగల్ స్పోర్ట్స్ : కోమటిపల్లిలోని క్రీడా మైదానంలో నిర్వహించిన ప్రవీణ్‌రాజ్ మెమోరియల్ క్రికెట్ టోర్నీలో ప్రతిభ కనబరిచిన ఆల్‌రౌండర్ క్రీడాకారుడు రిష్యంత్‌ను పలువురు అభినందించారు. హనుమకొండ జేఎన్ స్టేడియంలో డీఎస్ఏ కోచ్ మహ్మద్ అఫ్జల్ వద్ద శిక్షణ పొందుతున్న రిష్యంత్‌ను మంగళవారం వరంగల్ క్రికెట్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి మార్నేని ఉదయభానురావు మెమోంటోతో సత్కరించారు. వరంగల్, హనుమకొండ డీఎస్ఏ కోచ్‌లు సుమన్, అఫ్జల్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

దుండగులను అరెస్ట్ చేయాలి

ఖిలా వరంగల్ : కులం పేరుతో దూషించి హత్యాయత్నానికి పాల్పడిన దుండగులను వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని దళిత హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు సంఘి ఎలేందర్, జాతీయ మాల మహానాడు ఉపాధ్యక్షుడు మన్నే బాబురావు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వరంగల్ మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఉర్సు కరీమాబాద్ ప్రతాప్‌నగర్ ఎస్సీ కాలనీకి చెందిన మేకల కుమారస్వామిపై దాడి చేశారు. ఈదాడులో అతడు కంటిచూపు కోల్పోయి చికిత్స పొందుతున్నాడు. కుమారస్వామిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసుతో పాటు హత్యాప్రయత్నం కేసులు నమోదు చేయాలన్నారు. కలకోటి మహేందర్, రాంచందర్ రావు, రవిప్రసాద్, సురేష్, మహేందర్, రాజన్, మల్లేశం, రాజు, రాము, దర్మేందర్ పాల్గొన్నారు

టెక్నికల్ హబ్‌తో వరంగల్ అభివృద్ధి



కాశిబుగ్గ జంక్షన్‌లో మంత్రి కొండా సురేఖ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



మంత్రి కొండా సురేఖకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నేత శ్రీరాంరాజేష్

కాశిబుగ్గ : వరంగల్ తూర్పు నియోజకవర్గంలో రూ.200 కోట్ల వ్యయంతో ఏర్పాటయ్యే టెక్నికల్ హబ్‌తో వరంగల్ జిల్లా మొత్తం అభివృద్ధి చెందుతుందని టీపీసీసీ నాయకులు మీసాల ప్రకాశ్, నల్గొండ రమేష్ అన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కృషితోనే టెక్నికల్ హబ్ నగరంలో ఏర్పాటు చేసేందుకు మంత్రి మండలి అంగీకారం తెలిపిందంటూ మంగళవారం నగరంలోని కాశిబుగ్గ, వెంకట్రామ, తెలంగాణ జంక్షన్‌లలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత పాలకులు వరంగల్ జిల్లా అభివృద్ధిని విస్మరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కొన్ని రోజుల్లోనే వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే టెక్నికల్ హబ్‌ను తీసుకవచ్చి మార్పు అంటే ఏంటో చూపించారన్నారు. కాంగ్రెస్ సిటీ మహిళా అధ్యక్షురాలు నారగోని స్వప్న, దాసరి రాజేష్, కూచన రవీందర్, పుష్ప, లాజర్, వివేక్, రవి, ప్రభాకర్, సందీప్, జాషువా, భాస్కర్, శారద, సుజాత, విజయ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు

ఖిలా వరంగల్ : టెక్నికల్ హబ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేసినందుకు మంత్రి కొండా సురేఖను మంగళవారం వరంగల్‌కు చెందిన కాంగ్రెస్ నేత శ్రీరాం రాజేష్, శామంతుల శ్రీనివాస్ హైదరాబాద్‌లో వేర్వేరుగా కలిశారు. ఈసందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రైల్వేగేట్ ప్రాంతంలో పలువురు కాంగ్రెస్ నేతలు మంత్రి కొండా సురేఖ ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించారు.

‘అగ్నిపథ్’ యువతకు సువర్ణ అవకాశం



సమావేశంలో మాట్లాడుతున్న మాధవి

దేశాయిపేట : ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో ఎంపికకు అగ్నిపథ్ రిక్రూట్‌మెంట్ పథకం యువతకు సువర్ణ అవకాశమని వరంగల్ జిల్లా ఉపాధి అధికారి ఎస్.మాధవి అన్నారు. దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ కళాశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఐఏఎఫ్ అగ్నిపథ్ పథకంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎయిర్ ఫోర్స్ సీనియర్ నాన్ కమిషన్డ్ ఆఫీసర్ సార్జెంట్ రాజేష్ మాట్లాడారు. యువత ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో చేరేందుకు అగ్నిపథ్ దరఖాస్తు ప్రక్రియ ఫిబ్రవరి11న ముగుస్తుందన్నారు. వయో పరిమితి 17నుంచి 21ఏళ్లు ఉన్న యువకులు https://agnipathvayu.cdac.in లో నమోదు చేసుకోవాలన్నారు. ఈపథకంలో త్రివిధ దళాల్లో చేరేందుకు ఎంపికలు చేస్తారని తెలిపారు. ఉద్యోగం చేస్తూనే చదువుకునే వీలుందన్నారు.

సంక్షిప్త సమాచారం

బాలామృతం శ్రేయస్కరం

కరీమాబాద్ : చిన్నారులకు బాలామృతం ఇవ్వడం ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సీడీపీఓ విశ్వజ అన్నారు. ఉర్సు సుభాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పోషకాలతో కూడిన ఆహార పదార్థాలు పిల్లలకు ఇవ్వడం వల్ల ఎత్తుకు తగిన బరువుతోపాటు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన చేయించారు. సూపర్‌వైజర్ మాధవి, టీచర్ బత్తిని సునిత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

అవగాహన

ఖిలా వరంగల్ : రంగశాయిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం బాలికల అభివృద్ధి, నైపుణ్యాల పెంపుదలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కె.చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో బాలబాలికలకు విద్య చాలా అవసరమన్నారు. మండల పరశురాములు, లావణ్య, రంగాచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో ఆంజనేయుడు

కాజీపేట : కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలో కొలువుదీరిన దక్షిణ ముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు గణపతి, నాగేంద్ర స్వామి, ఆంజనేయుడికి అభిషేకాలు, అర్చనలు జరిపించారు. పట్టణంలోని ప్రముఖులు, ఆలయ పాలక మండలి సభ్యులు దర్శించుకుని పూజలు చేశారు.

అవకాశం ఇవ్వాలి

హన్మకొండ : బీజేపీ సీనియర్ నాయకుడు, చాంద్రాయణ గుట్ట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జన్నె మొగిళి పార్టీ అభ్యర్థిత్వం కోసం తీవ్రంగా శ్రమిస్తున్నాడు. మంగళవారం న్యూఢిల్లీలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్‌ను కలిసి వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి తనకు అవకాశం కల్పించాలని కోరాడు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. వరంగల్ ఎస్సీ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి తనకు అవకాశం కల్పించాలని, తాను గెలిచి వస్తానని తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

వరంగల్ క్రైం : హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముచ్చర్ల గ్రామంలో గల సర్వేనంబర్ 758/1లో 2ఎకరాల భూమికి తప్పుడు పట్టాదారు పాస్‌పుస్తకాలు చేసుకున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు. ఇనుగాల ప్రవీణ్ చందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రవీణ్‌చందర్‌రెడ్డికి వారసత్వంగా వచ్చిన భూమిని ముచ్చర్ల గ్రామానికి చెందిన గుడికందుల జంపయ్య, గుడికందుల రాజయ్య, గుడికందుల లింగమూర్తిలు అక్రమంగా పట్టా పాస్ పుస్తకాలు చేయించుకున్నట్లు కోర్టు ఆదేశాలు ఉన్నాయన్నారు. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

క్రీడల్లో రాణించాలి



కరీమాబాద్ : చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ గుస్తి జె నోరియా అన్నారు. వరంగల్‌లోని ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం ఐదో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. అందులో భాగంగా హాకీ, అర్చరీ, బ్యాడ్మింటన్ క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ నోరియా మాట్లాడుతూ త్వరలోనే ప్రపంచ స్థాయి సౌకర్యాలతో నూతన పాఠశాల నిర్మించడం జరుగుతుందని తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సరితారెడ్డి, హెచ్‌పీఎస్ సొసైటీ మాజీ చైర్మన్ జగదీష్‌రెడ్డితోపాటు సభ్యులు అప్పెందర్‌బాబు, జలగం వెంకట్రావు, రామంతాపూర్ ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్క సుమన్‌పై చర్య తీసుకోవాలి



హన్మకొండ అర్బన్ : ఇన్‌స్పెక్టర్ షుకుర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రెడ్డి సంఘం నాయకులు



కేయూ రెండో గేట్ వద్ద ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో..



మడికొండలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎన్ఎస్‌యూఐ హనుమకొండ జిల్లాశాఖ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మొదటి, రెండో గేట్‌ల వద్ద నిరసన తెలిపారు. అనంతరం బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అలాగే హన్మకొండ అర్బన్‌లో, మడికొండ చౌరస్తాలో, కాశీబుగ్గలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రెడ్డి సంఘం నాయకులు బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేసి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు.

-సాక్షి నెట్‌వర్క్

తునికాకు సేకరణకు టెండర్లు పిలవాలి

కరీమాబాద్: తునికాకు సేకరణకు టెండర్లు పిలిచి యాభై ఆకుల కట్టకు రూ.5గా నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడారు. అటవీ ప్రాంతంలోని గిరిజన, గిరిజనేతర ప్రజలు ప్రతీ వేసవిలో తునికాకు సేకరణ ద్వారా వచ్చే ఆదాయంతో జీవనాన్ని సాగిస్తారని తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు అడవిలో ఆకు సేకరణ సమయంలో అటవీ జంతువుల భారిన పడి ప్రాణాలు కోల్పోయే సందర్భాలుంటాయని పేర్కొన్నారు. అయితే తునికాకు కూలీలకు గతంలో రావాల్సిన బోనస్ డబ్బులు రాలేదని, అధికారులు కూలీలకు డబ్బులు చెల్లించకుండా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి ప్రతాపరెడ్డి, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ బాబురావుకు సన్మానం



హన్మకొండ కల్చరల్ : తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞాన పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావును లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సన్మానించారు.ఈ మేరకు మంగళవారం హంటర్‌రోడ్‌లోని పీఠంలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్‌సింగ్ నాయక్, టీడీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయ్‌సింగ్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌సింగ్ నాయక్, ఎస్టీ సెల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు బానోత్ నవీన్‌నాయక్ ఇటీవల పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన భూక్య బాబురావును మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కేయూ ఫార్మసీ డీన్‌కు..



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల డీన్‌గా బాధ్యతలను స్వీకరించిన ఆచార్య గాదె సమ్మయ్యను తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బొంగు రమేష్‌తో పాటు పలువురు వైద్యులు మంగళవారం సన్మానించారు. పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో డాక్టర్ రజనీకాంత్, ప్రసాద్‌రావు, రాజమోహన్, చంద్రశేఖర్ మార్కెటింగ్ మేనేజర్ గీతాంజలి పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, కేయూ ఫార్మసీ పూర్వ విద్యార్థి బొంగు రమేష్ మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమైందని అన్నారు.

నేషనల్ పవర్ లిఫ్టర్ జాఫర్‌కు..

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే దేవాలయ సముదాయంలో మంగళవారం రైల్వే ఆలయ కమిటీ సెక్రటరీ పి.భాస్కర్‌రావు ఆధ్వర్యంలో జాతీయ పవర్ లిఫ్టర్ ఎం.డి.జాఫర్, నాయకుడు మొలుగూరి ఈశ్వర్‌కు సన్మానం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నేషనల్ అథ్లెటిక్స్ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ పి.పరశురాములు, ట్రెజరర్ ఎస్.భాస్కర్, కమిటీ మెంబర్ పిట్టల వెంకటస్వామి, నేషనల్ అథ్లెటిక్స్ దామెరప్పుల మొగిలి, మేకమల్ల రాజు, రేవంత్, శ్రీనివాస్, బి. గోపాల్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE II JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD

I.A No. 4883 of 2023 &
I.A. No. 4884 of 2023
OS. No. 5578 of 2023

Between:
Kum. P. Uma Rani ....Petitioner
D/o. P.S Rama Raju,
aged about 44 years,
Occ: Cine Asst. Director,
R/o. Flat no. 1, Block-IV, Ground Floor, Film Nagar, Shaikpet Village, Hyderabad.
And
CH.Shekar S/o Ch. Veera Brahmam
Aged about 53 years, Occ: Business
R/o.Door no.13-2-232, Mattewada, Warangal, Telangana-506002
And 1 another. ... Respondents

Please take notice that the above named petitioner has filed the suit for "SPECIFIC PERFORMANCE OF AGREEMENT OF SALE DATED 1999, 18-06-2004,17-04-2006, 09-09-2010 29-11-2021, 23-05-2022, CONSEQUENTLY DECLARE THE SALE DEED BEARING DOCUMENT NO. 8003/2019 AS NULL AND AVOID" and Interim applications seeking under ORDER XXXIX RULE 1&2 R/W SEC. 151 OF CPC for Injunction. And not to alienate the suit schedule property, this notice issued in the name above mentioned Party and you are hereby directed to appear before the Hon'ble court on 12-02-2024 at 10:30 A.M at Hon'ble II JCJ, City Civil Court at Hyderabad either in person or through an advocate, failing which the case shall be decided in your absence in accordance with law.

//By Order of the Court//
B.ARAVIND REDDY
Advocates & Solicitors
Mobile: 96188 36353, 97056 87827